జగనే మా నమ్మకం

- బత్తిలి పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి ప్రచారం
- బ్రహ్మరథం పట్టిన గిరిజనులు
- జై జగన్ నినాదాలతో మార్మోగిన తివ్వాకొండలు



బత్తిలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

భామిని: 'నీ మాయమాటలు నమ్మం బాబూ.. జగనన్నే మాకు నమ్మకం బాబూ..' అంటు మహిళలు నినాదాలతో హోరెత్తించారు. వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి మద్దతుగా ప్రచారంలో పాల్గొని వెంటనడిచారు. మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు బత్తిలి పంచాయతీ పరిధిలో కళావతి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ టింగ శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు టింగ అన్నాజీరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆమెకు పూలమాలలు వేసి హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. ఆదివాసీ గిరిజనుల సంప్రదాయాల నడుమ కళావతికి కాళ్లు కడిగి జేజేలు పలికారు. బొడ్డగూడ, సవరపాడు, ఏటంగూడ, మణిగ, బంద్రసింగి, కోటకొండ, మూలగూడ, సన్నాయికాలనీలలో గిరిజనులు కళావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే గెలిపించుకుంటామని మాట ఇచ్చారు. గ్రామాల్లోని అన్ని వీధుల్లో భారీ ర్యాలీగా వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి సంక్షేమ పాలన అందించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. చంద్రబాబు మాయలో పడొద్దని, కూటమి బూటకపు హామీలు నమ్మి మోసపోవద్దని అన్నారు. జై జగన్, జై కళావతమ్మ నినాదాలతో తివ్వాకొండల్లో ఊర్లన్నీ మార్మోగాయి. గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాల ధ్వనులతో ప్రచారంలో జోష్ మరింత పెరిగింది. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు విశ్వనాథ్ పట్నాయక్, పార్టీ నాయకులు రాగోలు రాధాకృష్ణ, నిమ్మల దాస్, వమ్మరవిల్లి రమేష్, మండల నాయకులు తోట సింహాచలం, బోనగడ్డి ధర్మారావు, కొత్తకోట చంద్రశేఖర్, కొవ్వాడ చిరంజీవులు, మజ్జి మోహనబాబు, శివ్వాల తిరుపతి, లోతుగెడ్డ రవికుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

విశ్వాసానికి పట్టం కట్టండి

- పూటకో అబద్ధం చెప్పే కూటమి నాయకులను తరిమికొట్టండి
- ప్రభుత్వ పథకాలు అందకుండా అడ్డుకుంటున్నారు
- కళావతికి మద్దతుగా ఎమ్మెల్సీ విక్రాంత్ ప్రచారం
- జనసంద్రమైన పాలకొండ పట్టణం



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతికి మద్దతుగా పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. పాలకొండ పట్టణంలోని 15,16, 17,18 వార్డుల్లో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన జనసందోహం మధ్యలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. కూటమి పార్టీల నాటకాలపై ధ్వజమెత్తారు. పేదలకు అందాల్సిన పథకాలను అడ్డుకుని చంద్రబాబు శునకానందం పొందుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు అధికారంలో ఉండగా మహిళా సంఘాలకు చేసిన మోసం ఎవరూ మరిచిపోలేదన్నారు. అటువంటి పార్టీలను తరిమి కొట్టాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

రోజుకో నాటకం.. పూటకో అబద్ధం..

ప్రజా క్షేత్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ఆదరణ చూసి టీడీపీకి ఓటమి భయం పట్టుకుందని ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. ఎలాగైనా జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ప్రజలను దూరం చేయాలని టీడీపీ కుట్రలు చేస్తోందన్నారు. ఇందుకోసం రోజుకో నాటకం.. పూటకో అబద్ధం చెబుతూ ప్రజలను మోసగించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. కొత్తగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేస్తూ, ఐవీఆర్‌ఎస్ ఫోన్ కాల్స్‌తో కూడా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. భావితరాలకు వివాద రహిత భూమిని అందించడమే ధ్యేయంగా భూముల రీసర్వేను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవంతంగా చేపడుతోందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమల్లోకి వస్తే మన భూమికి పూర్తి భద్రత ఉంటుందని మేధావులు చెబుతుంటే.. ఈ యాక్ట్‌ను అడ్డుపెట్టుకుని చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ల్యాంట్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ చేస్తున్న ప్రచారాలన్నీ అభూతకల్పనలని అన్నారు.

కళావతికే నియోజకవర్గ ప్రజల మద్దతు..

వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి నియోజకవర్గ ప్రజలు అండగా ఉన్నారని తెలిపారు. పాలకొండ పట్టణంలో ఈ రోజు వేల సంఖ్యలో తరలివచ్చి మద్దతు అందించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు. కూటమి నాయకులు ఆడుతున్న నాటకాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా విశ్వాసరాయి కళావతని, ఎంపీగా గుమ్మ తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, కిల్లారి మోహన్, నీలాపు శ్రీను, కొంచాడ అరుణ్‌కుమార్, యందవ మరియదాసు, పల్లా భాను, తూముల లక్ష్మణ్, కె.విజయకుమార్, వై.లిల్లీపుష్పనాథంతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శరవేగంగా రక్షిత పథకం పనులు



భాసూరులో శరవేగంగా కొనసాగుతున్న ఇన్‌ఫిల్టరేషన్ బావి పనులు

పాలకొండ రూరల్: మండలంలోని భాసూరు గ్రామస్తుల చిరకాల స్వప్నం అతి త్వరలో కార్యరూపం దాల్చనుందని సర్పంచ్ శిర్లాపు మల్లేశ్వరమ్మ బుధవారం తెలిపారు. దశాబ్దాల కాలంగా తమ గ్రామ ప్రజలు సురక్షిత నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోటంతో ప్రజలు చెలమలపై ఆధారపడేవారన్నారు. జగనన్న హయాంలో రూ.70 లక్షలు పైబడి వ్యయంతో ఇన్‌ఫిల్టరేషన్ వెల్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరునాటికి బావి నుంచి పైపులైన్లు రక్షిత పథకానికి అనుసంధానం చేయటం జరుగుతుందన్నారు. త్వరలోనే గ్రామస్తులకు సురక్షిత తాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

రాజాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బొద్దాం, పాగిరి, కంచరాం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లను ఎన్నికల సిబ్బంది బుధవారం పరిశీలించారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికలు జరుగుతుండడంతో ఆయా కేంద్రాల వద్ద ఓటరు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించారా లేదా అనే విషయం గమనించారు. తాగునీరు, విద్యుత్, టెంట్లు వంటి సదుపాయాలతో పాటు దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంప్ ఉండేలా చూడాలని తెలిపారు.

రైతులకు ఉపయోగపడేలా పనులు

రాజాం: రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశమైన ఆయన.. ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా రోజుకు రెండు పూటలా ఉపాధి పనులు చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనిలోకి వచ్చిన వారికే పనులు కల్పించాలని తెలిపారు. పని ప్రదేశంలో తాగునీరు, చలువ పందిళ్లు, ప్రథమ చికిత్స కిట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో ఫ్యాన్ జోరు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో రాజకీయ పార్టీల నాయకులు ప్రచారంలో జోరు పెంచారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు బుధవారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించడంతో పాటు టీడీపీ మోసాలను ఎండగట్టారు. మే 13 జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. - సాక్షి నెట్‌వర్క్



గరుగుబిల్లి: పెద్దూరులో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు, తదితరులు



పాలకొండ రూరల్: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా అట్టలిలో ఇంటింట ప్రచారం చేస్తున్న సర్పంచ్ సంధ్యారాణి, నాయకులు



సీతంపేట: మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



వీరఘట్టం: మండలంలోని కిమ్మి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం



పాలకొండ రూరల్: సిరికొండలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైస్ ఎంపీపీలు సూర్యప్రకాష్, అనీల్‌కుమార్, తదితరులు

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



చినమేరంగిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పశ్రీవాణి దంపతులకు హారతి ఇచ్చి ఆశీర్వదిస్తున్న గ్రామస్తులు

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం పర్యటించిన ఆమెకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన పథకాలను వివరించారు. అన్నిప్రాంతాలతో పాటు అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్ తపన అని, ఆ దిశగా తన ఐదేళ్ల పాలన కొనసాగించి, అందరి మన్ననలు పొందారన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతానికి పైగా హామీలు అమలుచేసి, ధైర్యంగా ప్రజలను ఓట్లు అడిగే దమ్మున్న నాయకుడు జగనన్న అని అన్నారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో 600కు పైగా హామీలు ఇచ్చి, వాటిలో 1 శాతం కూడా నెరవేర్చని చంద్రబాబు కూడా ఓట్లు అడిగేందుకు వస్తున్నారని, ఎవరికి ఓటు వేయాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్‌దారుల వద్దకే పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క సర్టిఫికెట్ కావాలన్నా, రుణం కావాలన్నా, అభివృద్ధి పనులు జరగాలన్నా, పథకం అందాలన్నా అప్పటి జన్మభూమి కమిటీలు, నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే కానీ వచ్చేవి కావన్న విషయం గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఇప్పుడు కూర్చొన్న చోటకే పథకాలు వస్తున్నాయన్న విషయం మర్చిపోవద్దన్నారు. అప్పటి టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు.

ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల వేళ మళ్లీ మోసపూరిత హామీలతో వస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగనన్నకే మళ్లీ అధికారం అప్పగించాలన్నారు. నమ్మకంగా మనకు మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే అండగా నిలవాలన్నారు. వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ సంక్షేమం అందాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని కోరారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా పుష్పశ్రీవాణిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

సీతంపేట: పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, మల్లి బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం నుంచి ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర మాట్లాడుతూ.. ఈ నెల 24 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు ఈ కోచింగ్ ఎంతో దోహదపడుతుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో సబ్జెక్టులను బోధించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న డీడీ, డిప్యూటీ ఈఓ, తదితరులు

కార్యక్రమంలో డిప్యూటీఈఓ పి.నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీఓ రాములమ్మ, ఉపాధ్యాయులు ఏవీ శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు

కొమరాడ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగు చేసే నవధాన్యాలతో భూసారం పెరిగి, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఎస్‌ఎఫ్ఏ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గంగరేగువలస గ్రామంలో నవధాన్యాల కిట్లు రైతులకు బుధవారం పంపిణీ చేశారు. నేలలో నవధాన్యాలు వేసుకోవడం ద్వారా జీవవైవిధ్యం బాగుంటుందని, నేలలో నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుందని, నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు, రైతుమిత్రగా పేరొందిన వానపాములు పెరిగి నేలసారవంతమవుతుందన్నారు. తద్వారా పంటలు బాగా పండుతాయన్నారు. నవధాన్యాలు వేసిన 45 రోజుల్లో నేలలో నవధాన్యాల మొక్కలను కలియదున్నాలన్నారు.



నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఎఫ్ఏ శ్రీనివాస్

కార్యక్రమంలో మండల యాంకర్ ఎస్.ప్రసాద్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్‌మేకింగ్‌లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చేనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే మెరిట్ జాబితాలో ఉంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7569062449, 9390063881 ఫోన్ నంబర్లు సంప్రదించాలన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

భామిని: మండలంలోని కొరమ ఏబీరోడ్డు కూడలి వద్ద ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనం చుట్టు పెరిగిన పిచ్చిమొక్కలను బుధవారం తొలగించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అగతముడి రఘు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో పనులు చేయించారు. వంశధార వరద కాలువ పనులు, రోడ్డు విస్తరణ పనులతో ఈ షెడ్ నిరుపయోగంగా మారింది. షెడ్ పరిసరాలను శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు.



ప్రయాణికుల విశ్రాంతి భవనం పరిసరాలను శుభ్రం చేస్తున్న ఉపాధి కూలీలు

క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



తుమరాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ కోరారు. మండలంలోని కొండాపురం, తుమరాడ గ్రామాల్లో బుధవారం సిబ్బందితో కలిసి పర్యటించారు. ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలకు ఓటర్లు తవివ్వరాదన్నారు. ఎన్నికల వాతావరణానికి విఘాతం కలిగిస్తే కేసుల్లో చిక్కుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

కవ్వింపు చర్యలకు పాల్పడవద్దు

- ట్రైనీ డీఎస్పీ మహేంద్ర



గెడ్డవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర

రాజాం సిటీ: ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు ఒకరికొకరు కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర సూచించారు. మండలంలోని గెడ్డవలస, ఒమ్మి గ్రామాల్లో పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల నిబంధనలు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే ఇరువర్గాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ డి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: సార్వత్రిక ఎన్నికల వేళ ప్రజలు శాంతియుతంగా మెలగాలని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని ప్రజలకు ఎన్నికల నిబంధనలపై బుధవారం అవగాహనా కల్పించారు. ప్రజలు గుంపులుగా తిరగవద్దని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.వి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులంతా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ రాజాం చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామన్నారు. పాఠశాలల్లో యూత్ రెడ్‌క్రాస్ స్థాపించడంతో పాటు యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నేత్రదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. చైతన్యకుమార్, ఎ.దామోదరరావు, పి.సూర్యారావు, పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

రాజాం సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆర్వో ఎల్.జోసెఫ్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లతో బుధవారం సమావేశమైన ఆయన.. ఎన్నికల నిబంధనలు వివరించారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల దూరంలో ఓటర్లకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని తెలిపారు. అక్కడ కూడా ఒక టేబుల్, రెండు కుర్చీలే ఉపయోగించాలని, ఆ టీమ్ వద్ద పోస్టర్లు, సింబల్స్, తినుబండారాలకు అనుమతి లేదన్నారు. సదరు టీమ్ ఇచ్చే స్లిప్పులు కూడా తెల్లకాగితంపైనే ఉండాలన్నారు. పోలింగ్‌స్టేషన్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటున్న నేపథ్యంలో ఎక్కడా ప్రజలు గుమికూడి ఉండకూడదన్నారు. పోలింగ్ స్టేషన్‌కు వంద మీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల వద్ద యజమానులు తప్ప రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు గానీ, ప్రచార సామగ్రి గానీ ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ రోజున పరిసర ప్రాంతాల్లో గానీ, గ్రామంలో గానీ ఎటువంటి మైక్‌సెట్‌లు వాడకూడదన్నారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను వాహనం ద్వారా తీసుకురాకూడదని, అలా తీసుకువచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, సీఐలు డి.మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రేగిడి: మండలంలోని వావిలవలస, లింగాలవలస, తోకలవలస గ్రామాల్లో పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్(కవాతు ప్రదర్శన) నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటుంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే ధైర్యాన్ని ఓటరుకు కల్పిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో ఈ కవాతు ప్రదర్శన చేస్తున్నామని ఎస్ఐ ఇ.శ్రీనివాస్ తెలిపారు.